క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాజాపూర్: మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడం కోసం పర్యటించనున్నారు. ఈ మేరకు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కప్పేరిబచ్చిరెడ్డి మంగళవారం మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోయిల్‌కొండ: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి, మురళీకృష్ణ స్వామి దేవాలయనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రానున్నట్లు ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయ నిర్మాణానికి రూ. 1.5 కోట్లు మంజూరైనట్లు వివరించారు.

మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు

దేవరకద్ర: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటడానికి గుంతలు తీసి సిద్ధం చేశారు. ఈఓ సీత్యానాయక్ పర్యవేక్షణ చేశారు. పట్టణంలో పలుచోట్ల వీధిలైట్లు ఏర్పాటు, ప్రధాన రోడ్లపై చెత్తను తొలగించడం చేయించారు.

మిషన్ భగీరథ ద్వారా కలుషిత నీరు

పరిశీలించిన అధికారులు

జడ్చర్ల: మిషన్ భగీరథ తాగు నీటి సరఫరాను మంగళవారం సంబంధిత ఏఈ లక్ష్మారెడ్డి, తదితర సిబ్బంది పరిశీలించారు. 3వ వార్డులోని శ్రీవెంకటేశ్వర కాలనీలో మిషన్ భగీరథ నీరు కలుషితంగా మారి భరించలేని వాసనతో వస్తున్నాయని కాలనీ వాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మికి ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. వాసన వస్తున్న విషయాన్ని గమనించి పైప్‌లైన్‌లను తనిఖీ చేశారు. కానీ కలుషితం అవుతున్న ప్రదేశాన్ని గుర్తించ లేకపోయారు. త్వరలోనే సమస్యను గుర్తించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘అల్లూరి’ వీరత్వం ఆదర్శనీయం

జడ్చర్ల టౌన్: అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని మంగళవారం జడ్చర్లలోని సరస్వతి శిశుమందిరంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన కనబర్చిన వీరత్వాన్ని విద్యార్థులకు హెచ్‌ఎం వెంకటయ్య వివరించారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, పాల్గొన్నారు. ఉమెన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలోనూ నివాళులు అర్పించారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలి

అడ్డాకుల: తుంకినీపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆవుల శేఖర్, హేమలత దంపతులు తమ మేనకోడలు క్రితిక జ్ఞాపకార్థం మంగళవారం నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి దాతలు తోడ్పడాలని హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్ కోరారు. సర్పంచ్ లక్ష్మణ్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, దాతలు శేఖర్, హేమలత తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జడ్చర్ల: పెద్ద తండాకు చెందిన చంద్రయ్యకు మంజూరయిన రూ. 2లక్షల ఎల్‌ఓసీని మంగళవారం జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య అందజేశారు. సర్పంచ్ రవినాయక్, నాయకులు నాగరాజు, రాజేందర్‌రెడ్డి, భీంరాజు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను తరలించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని రెండవ అంతస్తులో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ రవినాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. కనీసం పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని కింద ఫ్లోర్‌లో నైనా ఏర్పాటు చేయాలని, రెండవ అంతస్తుకు వెళ్లేందుకు వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

ఎంపీఓకు సత్కారం

అడ్డాకుల: ఎంపీఓ విజయకుమారి బాలానగర్‌కు బదిలీ కావడంతో మంగళవారం ఆమెను మండల పరిషత్ కార్యాలయం వద్ద సత్కరించారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా అడ్డాకుల మండలానికి కొయిలకొండ మండలంలో పని చేస్తున్న శ్రీదేవిని కేటాయించినట్లు తెలిసింది. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, తహసీల్దార్ కిషన్, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్ ఉన్నారు.

కల్వరి ఎంబీ పాస్టర్‌కు..

స్టేషన్ మహబూబ్‌నగర్: కల్వరి మెన్నోనైట్ బ్రదరన్ చర్చ్ (ఎంబీసీ)లో గత 40 ఏళ్ల నుంచి పాస్టర్‌గా, చైర్మన్‌గా పనిచేస్తున్న రెవరెండ్ ఎస్. వరప్రసాద్‌ను సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చ్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బీఏ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి స్టీవెన్, ఇమ్మాన్యుయేల్ రాజు, టైటస్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడ్డెమాన్ బోనాల ఊరేగింపు



అమిస్తాపూర్‌లో బోనంతో కోలాటాలు వేస్తున్న మహిళలు

కనులపండువగా బోనాలు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోడూర్, మాచన్‌పల్లి తదితర గ్రామాల్లో మంగళవారం బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సన్నాయి, బ్యాండ్ వాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాజు, డీసీసీబీ డైరెక్టర్ నర్సిములు, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మన్యంకొండ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుడు చిన్నయ్యగౌడ్‌లు పాల్గొనగా, మాచన్‌పల్లిలో సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భూత్పూర్: అమిస్తాపూర్‌లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. 5వవార్డు కౌన్సిలర్ కృష్ణవేణి బాలస్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక మేక పోతులతో ఏర్పాటు చేసిన శకటాన్ని తీసుకువచ్చి వీధులగా గుండా అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. తొమ్మిది రూపాలల్లో అమ్మవారి అలంకరణ, పోతురాజుల విన్యాసాలు, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి.



అమిస్తాపూర్‌లో అమ్మవారి ప్రతిరూపాలతో విన్యాసాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రాజేంద్రనగర్ సద్దల్‌గుండ్‌లో పోచమ్మ శీతలాదేవి దేవాలయం ధ్వజస్తంభ, ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈనెల 1 నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. కౌన్సిలర్ స్వప్నయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వర్షాలు బాగా కురవాలని, పాడిపంటలు వృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీమణి శారద పోచమ్మ అమ్మవారిని ప్రార్థించారు. జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో మంగళవారం పోచమ్మ బోనాల వేడుకలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సిములు పాల్గొన్నారు. **చిన్నచింతకుంట:** చిన్నవడ్డెమాన్, పెద్దవడ్డెమాన్ గ్రామల్లో బోనాల పండుగను నిర్వహించారు.

హన్వాడ: మండలంలో ఆషాడమాసం బోనాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం పరిధిలోని ఇబ్రహీంబాద్‌లో బోనాల పండుగ నిర్వహించారు.



జిల్లాకేంద్రంలో సద్దల్‌గుండులో బోనాల ఊరేగింపు



ఏనుగొండలో వేడుకల్లో పాల్గొన్న మంత్రి సతీమణి శారద



అమిస్తాపూర్‌లో పోతురాజుల విన్యాసాలు



కోడూర్‌లో ..



పోచమ్మ విగ్రహం ఊరేగింపు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

నవాబుపేట: గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారిణి విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. దాదాపుగా 327 మంది క్యాంపులో పరీక్షలు చేయించుకుని మందులు పొందినట్లు ఆమె వివరించారు. ఫోరం నాయకులు జగపతిరావు, నాగభూషణం, నర్సిములు, వెంకటేశ్వరప్ప, వేణునాథం తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించాలి: డీఈఓ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు పాఠశాల స్థాయిలో కష్టపడి చదువులో రాణించాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులో భారత సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. లయన్ నటరాజ్, గాయత్రి, పల్లవి, గీత, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష, జరిమానా

అడ్డాకుల: డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి మంగళవారం తెలిపారు. జూన్ 19న వనపర్తి పట్టణానికి చెందిన పాత్లావత్ శంకర్ మద్యం మత్తులో డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడని వివరించారు. సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నిందితుడిని హాజరుపర్చగా నాలుగురోజుల జైలుశిక్ష, రూ.2500 జరిమానా విధించారని పేర్కొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: మంగంపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇరువురూ రూ.50వేల చొప్పున విరాళాలు అందించారు. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దైవచింతన అందరికీ అవసరమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: శాఖాపూర్ గ్రామానికి చెందిన దేవనూరు సత్యనారాయణరెడ్డి కుమారుడు హేమంత్‌రెడ్డి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతూ ఇటీవల అనారోగ్యానికి గురై జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత విద్యార్థిని సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్ మంగళవారం ఆస్పత్రిలో పరామర్శించారు. చికిత్స కోసం రూ.5వేలను అందజేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల అభ్యర్థనతో జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి రూ.15వేలను పంపడంతో విద్యార్థి తండ్రికి అందజేశారు.

జవాబుదారీగా ఉండాలి

- ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి
- అడ్డాకుల మండలసభలో ‘ఉపాధి’పై వాడివేడి చర్చ



అడ్డాకుల మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి

అడ్డాకుల: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు గుర్తించి వాటిని పరిష్కరిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో ఉపాధిహామీ పనులపై వాడివేడీగా చర్చసాగింది. గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేసే పనుల వివరాలను సర్పంచులకు ఎందుకు తెలపడం లేదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఇకపై తప్పకుండా సమాచారం ఇస్తామని అధికారులు తెలిపారు. పంట కాలువలను ఉపాధిహామీలో బాగుచేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. కందూర్, రాచాల, ముత్యాలంపల్లి తదితర గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకున్న పొలాలకు కూడా రైతుబంధు వస్తోందని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సర్పంచులు డిమాండ్ చేశారు. కందూర్‌లో ప్రైమరీ స్కూల్ శిథిలావస్థకు చేరిందని, ఖాళీ చేసి జెడ్పీ హైస్కూల్‌లోకి మార్చినా కొత్త భవన నిర్మాణం గురించి ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ శ్రీకాంత్ వాపోయారు. చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లు ఇంకా రేషన్ కార్డుల్లో ఉన్నాయని, వారి పేరున రేషన్ సరుకులు వస్తున్నాయని సభ్యులు సభదృష్టికి తెచ్చారు. చనిపోయిన వారి పేర్లను రేషన్ కార్డుల్లో నుంచి తొలగించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కందూర్‌లో కుక్కల బెడద ఎక్కువగా కుక్కల దాడిలో ఇటీవల ఇద్దరు పిల్లలు గాయపడ్డారని సర్పంచ్ తెలిపారు. కందూర్ శివారులోని వెంకటేశ్వర హెచరీస్ యాజమాన్యం గ్రామ పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. సభలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ మంజుల, వైస్ ఎంపీపీ రాధిక, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కావేంజర్లను నియమించండి

జడ్చర్ల టౌన్: పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించాలని ఉమ్మడి జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్ దానంహరిబాబు కోరారు. మంగళవారం జడ్చర్ల ఎమ్మార్సీలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనుకు వినతి పత్రం సమర్పించారు. స్కావేంజర్లు లేకపోవటం వల్ల పాఠశాలల్లో విద్యార్థులతో క్లీనింగ్ చేయిస్తున్నారని వాపోయారు.

వీల్‌చైర్ వితరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుడైన శివకుమార్‌కు మంగళవారం మేడిశెట్టి రవికుమార్ తన కుమారుడు కౌశల్ పుట్టిన రోజును పురస్కరించుకొని వీల్‌చైర్ అందించినట్లు వివరించారు. క్లబ్‌ల అధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీదేవి పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం జెడ్పీ కార్యాలయం సమీపంలోని శ్రీద్వారకామయి బాబా మందిరంలో గురుపూర్ణిమ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉదయం కాగడహారతి, బాబావారికి అభిషేకం, మహామంగళహారతి, తదితర పూజలు నిర్వహించారు.

దుకాణ దారులకు జరిమానా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో 120 మైక్రాన్ల లోపు కలిగిన ప్లాస్టిక్, పాలిథీన్ కవర్లు, గ్లాసులను అమ్ముతున్న దుకాణాదారులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారీ ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్, భగీరథకాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు 60 షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 100కిలోల బరువు కలిగిన నిషేధించిన పాలథీన్, ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. 12మంది దుకాణ దారుల నుంచి రూ.15 వేలు జరిమానా వసూలు చేశారు.

బాల కార్మికుడికి విముక్తి

మహబూబ్‌నగర్ క్రైం: గొర్రెల దగ్గర కాపలదారుడిగా ఉన్న ఓ బాల కార్మికుడిని బాలల రక్షణ విభాగం సిబ్బంది రెస్క్యూ చేసి హోంకు తరలించారు. మద్దూర్ మండలం చెన్నారెడ్డి పల్లి గ్రామంలో 12ఏళ్ల బాలుడు గొర్రెల కాపలదారుడిగా పని చేస్తున్నాడని వచ్చిన సమాచారంతో ప్రొటెక్షన్ అధికారిని కరిష్మా, సోషల్ వర్కర్ శ్రావణ్‌కుమార్, చైల్డ్ లైన్ కేస్ వర్కర్ అశ్విని కలిసి సదరు బాలుడిని రెస్క్యూ చేసి నారాయణపేటలోని బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరుపరిచి ఆ తర్వాత హోంకు తరలించారు. ఆ బాలుడిని చదువుల కోసం వసతి గృహంలో ఉంచుతామని వెల్లడించారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

జడ్చర్ల: బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు మంగళవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో నగదు పురస్కారాలను అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.1,116 నగదుతో పాటు ఓ పతకాన్ని అందించి సన్మానించారు. మునుముందు తమ క్లబ్ ద్వార విద్యార్థుల సంక్షేమానికి పాటుపడుతామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధ్యక్షులు వీణా, మండల అధ్యక్షులు బాదం సంజీవ్‌గుప్త, కార్యదర్శి రాఘవేందర్, రామకృష్ణ, దేవరాజ్, లక్ష్మి, సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని బస్టాండ్ వద్ద మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లను నిర్మించాలని బీఎస్పీ నాయకులు అన్నారు. నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాలను అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి బస్టాండ్‌కు వచ్చే మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

విద్యార్థి రాధికకు హాస్టల్ వసతి

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: మండలంలోని వెన్నచేడ్ గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో వసతులు సరిగా లేవనే అంశంపై సాక్షి దినపత్రికలో గత నెల 29న ‘అవస్థల్లో ఆదర్శం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న జూలపల్లి పెద్ద తండా విద్యార్థి రాధికకు హాస్టల్ వసతి కల్పించారు. దీంతో నిత్యం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో విద్యార్థి పడుతున్న అవస్థ తొలగిపోనుంది. ప్రిన్సిపాల్ కొండల్‌రావు, కేర్‌టేకర్ వీణరాధికకు హాస్టల్‌లో వసతి కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వారితో పాటు సమస్యను వెలుగులోకి తెచ్చి హాస్టల్ సీటు వచ్చేందుకు దోహద పడిన సాక్షి దినపత్రికకు విద్యార్థి రాధిక, ముంబాయిలో ఉంటున్న ఆమె తల్లిదండ్రులు జయమ్మ, పెంట్యా నాయక్‌లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి

జడ్చర్ల టౌన్: వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే స్వాగతిస్తామని న్యాయవాది టి. శ్రీనివాస్‌గౌడ్ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌కు హితవు పలికారు. శిఖర్‌గానిపల్లి భూ వివాదం కేసులో ఆయన తీరుపై విలేకరుల సమావేశానికి సంబంధించి తప్పుపట్టారు. తమ క్లయింట్ బీసీలేనని, గ్రామానికి వచ్చి న్యాయం ఉందో గుర్తించాలన్నారు. వెంకటమ్మ తన క్లయింట్ల భూమిలోకి వచ్చి రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. వివాదంలో ఎమ్మెల్యే ప్రమేయం లేదని, ఆయనను లాగడం సరికాదన్నారు. తమ క్లయింట్లపై పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనా తాము వ్యతిరేకించలేదన్నారు. పై కేసులో మానవహక్కుల కమిషన్, తదితరులను సంప్రదించిన వారు గ్రామానికి ఎందుక రావడం లేదని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నర్సింహస్వామి కుటుంబసభ్యులు మాట్లాడుతూ తమపై పాలెవాండ్లయిన మండ్లస్వామి, వెంకటస్వామి, వెంకటమ్మలు దౌర్జన్యం చేయటంతోపాటు వివాదం పెంచుతున్నారన్నారు. ప్రతిసారి భూములోకి వచ్చి పనులు చేసుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. తమవద్ద అన్ని పత్రాలు, ఇంజక్షన్ ఆర్డర్లు ఉన్నాయని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

భూత్పూర్: సీజనల్ వ్యాధులపై ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి డా.హిమబిందు అన్నారు. మంగళవారం ఆశ డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్, సీహెచ్‌వో రామయ్య, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు అవసరం

హన్వాడ: విద్యార్థులందరి కోసం కచ్చితమైన విద్యాప్రమాణాలు రావాలని మండల విద్యాధికారి రాజు నాయక్ సూచించారు. మంగళవారం కొత్తపేట, టంకర గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యాప్రమాణాల్ని పరిశీలించారు. తరగతుల్లో చదువుల్లో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులపై ఇప్పటినుంచే ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సీఆర్పీ కుమార్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్యకు ఘననివాళి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: హైదరాబాద్ నగరంలోని ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ కిల్లె గోపాల్ అన్నారు. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోనూ కొమురయ్యకు ఘన నివాళులర్పించారు. చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఎంసీ వెంకటేశ్వర రావు, టీపీఓ లక్ష్మీపతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : కొమురయ్య త్యాగం మరువలేనిదని ఎస్‌ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. పీయూలో నివాళి అర్పించారు. శ్రీశైలం, రాకేష్, గణేష్, మారుతి పాల్గొన్నారు.

ప్రధానికి మద్దతు పలకండి



మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు

హన్వాడ: యువత కేంద్రప్రభుత్వ నంబర్ 9090902024కు మిస్‌కాల్ ఇచ్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు పలకాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్పీ వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బూత్‌స్థాయి ఇన్‌చార్జ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కొండాబుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కుర్వరమేష్, విస్తారక్ దినేష్‌లు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బూత్ సమ్మేళనం నిర్వహించారు.

దేవరకద్ర: నియోజకవర్గంలో స్వల్పకాలిక విస్తారక్‌గా పర్యటించడానికి వచ్చిన పుణ్యపాల్‌జీకి మండల నాయకులు స్వాగతం పలికి సన్మానం చేశారు. జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

రాజాపూర్: కేంద్రంలో ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని కర్ణాటక విస్తారక్ ప్రముఖ్‌ప్రసన్న పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బూత్‌కమిటీల గురించి చర్చించారు. మండల అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాకర్లపహాడ్‌లో శాకాహార ర్యాలీ

నవాబుపేట: పిరమిడ్ ధ్యాన సొసైటీ ఆధ్వర్యంలో కాకర్లపహాడ్‌లో శాకాహార ర్యాలీ మంగళవారం నిర్వహించారు. సొసైటీ సభ్యుడు, ఆంజనేయరెడ్డి శాకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. గ్రామంలో 51 వారాలు శ్వాసమీద ధ్యాస కార్యక్రమం నిర్వహించిన సభ్యులను అభినందించారు. సర్పంచ్ జంగమ్మ, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, నర్సింహులు, మైసమ్మ ఆలయ చైర్మన్ కృష్ణయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మండలం ప్రకటించాల్సిందే..

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను నూతన మండలంగా ప్రకటించాల్సిందేనని జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం 164వ రోజు మండలసాధన సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలేదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంగా ప్రకటించడంలో నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలని వినతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మెమో నం.57 ప్రకారం 2004కు ముందు నియమితులైన వారికి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అమలు చేయాలని 2003–డీఎస్సీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ మహమూద్, జిల్లా ఇన్‌చార్జ్ అయ్యప్పరెడ్డి, సమన్వయకర్తలు సి.వెంకటేష్, బి.శ్రీధర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రం లో టీఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్‌లకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం దృష్టికి తేవాలని విజ్ఞప్తి చేశారు.